# బరువు

పొలదుడుగు వెంకటేశ్వరరావు



అప్పుడే సిటీలో విశాలమయిన తారు రోడ్ల ప్రక్కనే మెర్క్యురీ దీపాలు వెలిగాయ్‌. నల్లని చీకటి మూలలకూ, సందులకూ పారిపోయింది. నగర కన్య అలంకారాలు చేసుకుంటూంటే సన్నగా పిల్లగాలులు వీస్తున్నాయ్.

భూపతి బంగళాలో ఆవేళ సాయంత్రంనించీ చాలా సందడిగా వుంది. ఒక డజనుదాకా కోళ్ళు తెగేయి. స్పెషల్‌గా బుట్టల్లో బెజవాడనుంచి రొయ్యలు కార్లో వచ్చేయ్. మాచర్ల ప్రాంతంనుంచి పీతల్ని తెప్పించేరు.

సుమారు ఒక అరడజనుమంది పని వాళ్ళు ఆ సాయంత్రంనుంచీ ఆ పని మీదే వున్నారు. చీకటి పడినప్పటి నుంచీ ఆ బంగళా వెనుకవయిపునుంచి ముందుకి మషాలా వాసనలు, కమ్మగా గాలిని తేలివస్తూ నోరూరించటం మొదలైంది. ఫ్రెష్‌గా, గోరువెచ్చని నీటితో స్నానం చేసి, లాల్చీ, పంచా ధరించి త్రీ ఫైవ్స్ సిగరెట్ కాలుస్తూ గుమ్మంలోనే నిలబడి అతిధుల్ని ఆహ్వానించటానికి సిద్ధంగా వున్నాడు భూపతి.

భూపతి వయస్సు నలభై సంవత్సరాలు. పిత్రార్జితం సుమారు ఒక కోటికి అటూ ఇటూగా వుంటుంది. దేశంలోని ముఖ్యమయిన పట్టణాల్లోనూ, బెజవాడా, హైదరాబాదుల్లోనూ బంగళాలున్నాయ్. కొన్ని ముఖ్యమయిన పరిశ్రమలలో చాలా వాటాలున్నాయి. ఇంపార్టెంట్ సెంటర్లలో, ఒక అరడజను సినిమా హాళ్ళున్నాయి. అంతేగాక కొన్ని రైసు మిల్లుల్లో భాగస్వామ్యం, స్వంత వూళ్లో రకరకాలయిన పేర్ల మీద సుక్షేత్రమయిన, సాలుకి రెండుసార్లు పండే వంద ఎకరాల మంచి మాగాణీ వుంది.

పాతికెకరాల మెరకపొలం, టన్నులు కొద్దీ పసుపుని ఏటా అందిస్తుంది. ఇంతే గాక స్వంత ఏరియాలో, ఒక వంద గ్రామాల పరిధిలో, చాలామంది బంధువులూ, బలమయిన అనుచర వర్గమూ, కొండంత పరపతీ, పుష్కలంగా ఇన్ఫ్లూయెన్సూ, భూపతికి వున్నాయి. భూపతి తాత తండ్రాదులు గొప్పగా బ్రతికారు. ఆ ఏరియాలో వాళ్ళమాటకి తిరుగులేదు. ఆ పద్ధతి భూపతి తాతగారి తరంవరకూ సాగింది. భూపతి తండ్రిగారి కాలంలోనే కొన్ని కొన్ని మార్పులు వచ్చాయి. కొన్ని తరాలనించీ ఏకఛత్రాధిపత్యంగా సాగిన ఆ నిర్వాహకం, ఎదురుదెబ్బలు తిన్నది. మార్పు ఎప్పుడూ ఘర్షణలు లేకుండా రాదు. ఘర్షణలు వుద్రేకాల్ని తెచ్చిపెట్టాయి. వుద్రేకాల వలన పట్టుదలలు పెరుగుతాయి. స్పర్థలూ తలెత్తుతాయి. పౌరుషాలూ పంతాలు చెలరేగుతయ్. న్యాయాన్యాయ విచక్షణ నశిస్తుంది. ఆ పరిస్థితుల్లో ఎంతటి ఘోరాలు అయినా అతిసులువుగానే జరిగిపోతాయ్; తరువాత సంగతి తరువాత.

భూపతి ఎం. ఏ. వరకూ చదువుకున్నాడు. సెలవుల్లో ఇంటికి వచ్చిపోతూ వున్నప్పుడు, భూపతికి అన్నిసంగతులూ వివరంగానే తెలుస్తూవుండేవి. తండ్రితో తనకు తోచిన పరిష్కారాల్ని గురించి చెపుదామని అనుకుంటూ వుండేవాడు. కాని, ఆయనతో ఏమీ చెప్పటానికి సాహసించలేక పోయాడు. అందువలన భూపతి ఆ జరిగిన సంఘటనలకి కేవలం ప్రేక్షకుడుగానూ, శ్రోతగానే మిగిలిపోయేడు.

ఒకనాడు సాగిన రీతిగా, ఏ నాడూ సాగాలంటే కుదరదు. మనుషుల్లో, సమాజంలో, కాలమాన పరిస్థితుల్లో ఎన్నో మార్పులు, చేర్పులు, వస్తూవున్నాయి. సాంఘిక జీవనంలో కొత్త ధోరణలు తలెత్తుతున్నాయి. ఒకనాడు చీకటిలో, అజ్ఞానంలో పడివుండినవాళ్ళు కూడా, ఈ రోజున కళ్ళుతెరిచి వెలుగును చూడగలుగుతున్నారు. అలా కాదని, వాళ్ళని చీకటికోణాల్లోకి తోయాలని చూడటం కాలాన్ని వెనక్కి తిప్పాలని మూర్ఖంగా ప్రయత్నించటమే.

కొన్ని తరాల క్రిందట, ఆ కాలంలో అథార్టీ వుండింది. కాని, అన్యాయం అక్రమం బరితెగించలేదు. అందువలన కొంచెం అటూ ఇటూగా సర్దుకుపోవటం జరిగింది. అయితే కాలమాన జీవన పరిస్థితులతోపాటు పెచ్చరిల్లిని స్వార్థం, ఆ పద్ధతిని అనవాయితీగా తీసుకుని, హక్కుగా పరిగణించి, స్వప్రయోజనానికి వాడుకోజూడటం వలననే ఘర్షణ తప్పలేదు. అందుకు బాధపడటం వల్లనా. పగ తీర్చుకోజూడటం వల్లనా; భూపతి తండ్రి, రఘుపతిగారు ఆ ఏరియాలో పరమ రాక్షసుడుగా పేరు తెచ్చుకున్నాడు. తమ కుటుంబం ఆధ్వర్యంలో ఆ రోజులలో సాగిన దారుణ అకృత్యాల గురించి ఆలోచిస్తే భూపతికి అసహ్యంగా అనిపించటమే గాక, వళ్ళు జలదరిస్తుంది కూడా. అది గతం, ఒకతరం క్రిందటి సంగతి.

అతిథులు రావటం ఆరంభమయింది.

కార్లువచ్చి పోర్టికోలో ఆగుతున్నాయ్- అతిథులు దిగగానే, అవతలికి తరలివెళ్ళి పార్కింగ్ ప్లేస్‌లో నిలబడుతున్నాయ్.

షేక్‌హాండిచ్చి, సాదరంగా ఆహ్వానించి, అతిథుల్ని తీసుకువెళ్ళి లోపల హాల్లో సోఫాల్లో కూర్చోపెట్టున్నాడు, భూపతి.

చివరిగా వచ్చినవాడు చలపతి.

చలపతి భూపతికి చిన్ననాటి స్నేహితుడు. ఒక రకంగా బంధువు కూడా. భూపతిమీద చలపతికి అంతులేని గౌరవమూ, అభిమానమూ వున్నాయి. ప్రస్తుతం, భూపతికి కావలసిన వాళ్ళల్లో చలపతి చాలా ముఖ్యుడు.

పార్టీ మొదలయింది.

కేసుల్లోంచి ఇంపోర్టెడ్ బాటిల్స్ తీసారు.

కార్డులుతీసి ఆడటం మొదలెట్టారు. చాలా ఖరీదయిన స్టేక్.

గ్లాసుల్లోంచి ఐస్‌క్యూబ్స్ వేసిన మందు, వెచ్చగా గొంతులు దిగింది.

లోపల్నుంచి డిషెస్ వచ్చాయి; వేడి వేడిగా పొగలు గ్రక్కుతూ. ప్లేట్లలో చికెన్ రోస్ట్, ప్రాన్ మసాలా, క్రాబ్ కరీ, ఫిష్ ఫ్రై, రోస్టెడ్ కాజూ, గ్రీన్ పీస్— బేరర్లు తెచ్చి అందిస్తున్నారు. గ్లాసులు ఖాళీఅవగానే వెంటనే డ్రింక్‌తో నింపుతున్నారు. ఏ లోపమూ జరగకుండా జాగ్రత్తపడ్తున్నారు.

వెచ్చగా హాయిగా తేలిపోతూవుంది, వాతావరణం.

గమ్మత్తయిన ఒక విధమయిన మత్తు.

కొత్త కట్టల్లోంచి విడివడి వంద రూపాయిల నోట్లు పెళపెళలాడ్తూ చేతులు మార్తున్నాయ్.

భూపతి సెక్రెటరీ సురేష్, ఎవరికీ ఏలోటూ రాకుండా సూపర్‌వయిజ్ చేస్తున్నాడు.

మూడో రవుండ్ ముగించగానే— ఆ తర్వాతి రవుండ్లు కంట్రోలు తప్పాయి. స్పీడు పెరిగింది. మనుషుల ధోరణి మారింది.

ఒక గెస్ట్ ఈల మొదలెట్టాడు.

మరొకాయన డ్రాప్‌వేసి, డాన్స్ ప్రారంభించగా, ఇంకొక పెద్దమనిషి మ్యూజిక్ ఇచ్చాడు, నోటితోనూ, చేతుల్తోనూ, ఏ టైప్ ఆఫ్ మాడ్‌నెస్‌తో వాతావరణంలో కుర్రతనం చోటు చేసుకుంది,

'నాకేం తృప్తిగా లేదు, భూపతీ. అయాం నాట్ సాటిస్‌ఫైడ్;' అని డిక్లేర్ చేశాడు రత్నం, భూపతికి మంచిమిత్రుడు. కిక్ ఎక్కువయితే ఈజీగా తలక్రిందులవుతాడు.

'వాట్ మై ఫ్రెండ్. వాట్ డూ యూ వాంట్?' ఆప్యాయంగా అడిగాడు భూపతి.

'మైడియర్ బోయ్! ఇంత గ్రాండ్‌గా ఎరేంజిచేసిన ఈ పార్టీలో ఒకే ఒక్క లోటు కొట్టవచ్చినట్టు కన్పిస్తోందోయ్! అదేమిటో మీకూ తెలుసు.' అన్నాడు. మోహన్ నవ్వుతూ.

'ఏమిటో చెప్పు. క్షణాల్లో ఎరేంజ్ చేస్తాను' అన్నాడు భూపతి.

'మాట తప్పవు గదా?'

'ఉహు' అని తల అడ్డంగా వూపాడు భూపతి.

'జంటిల్మెన్! ఒక క్షణం ఆట ఆపి ఈ మాట వినండి' బిగ్గరగా అరిచాడు మోహన్.

ఆట ఆగింది.

అందరూ మోహన్‌వంక చూసారు.

'నాకు పిల్ల కావాలయ్యా!' అమాయకంగా మత్తుగా తన కోరికని బయట పెట్టాడు మోహన్.

'ఓ గ్రాండ్! నాకూ ఒక ఎత్తు స్తనాల చిన్నది గావాలి' రెడ్డి షంతోషంగా అరిచాడు.

'ఎందుకూ ఆలస్యం? నాకూ కావాలి. కాని నేను కోరుకునేది చిన్ని స్తనాల చిన్నదాన్ని మాత్రమే సుమా!'

భూపతి తెల్లమొహం పెట్టాడు.


అయోమయంగా అటూ ఇటూ చూసాడు.

ఈ లోగా అటుగావచ్చిన సురేష్‌ని పిలిచి, ఆ పని పురమాయించాడు, పిచ్చియ్య. సిటీలో పిచ్చియ్య ఒక పెద్ద బిజినెస్ మాగ్నెట్.

మళ్ళీ, కొత్తవూపు నందుకున్న పేకాట జోరుగా సాగింది.

పావుగంటలోనే కార్లోవచ్చి దిగారు గరల్స్.

అతి తక్కువ శృతిలో తబలా వాయింపబడగా, డాన్స్ మొదలయింది. కైపెక్కించే పాటలు – వెర్రెత్తేటట్టు




చేసే అర్ధనగ్నమయిన అంగాంగ విన్యాసాలు, విలాసాలు, హొయలు అర్ధ కవుగిళలు, చిరుముద్దుల సరదాలు, గాలి వేడెక్కింది.

వెర్రి ఆనందం.

వింత సంతోషం.

మత్తిల్లిన పిచ్చితనం.

హుంకరించిన ధనవాదం.

కనులు మూతబడిన ఆ మతానికి పాదాక్రాంతమయిన జీవన వ్యాపారం.

ఆ బ్యాక్‌గ్రవుండ్‌లో కన్నీటి నల్ల సముద్రాల భయంకరమైన అలల ఆక్రందన.

బయటికివచ్చి వరండాలో పేము కుర్చీలో కూర్చున్నాడు భూపతి. అతనికి ఇదంతా కొత్తగా, అసహ్యంగా, భయంకరంగా వుంది. అయినా తప్పేది లేదు. జీవితంలో ఒక భాగమయినది. వ్యాపారం; అది కొంతకాలంపాటయినా జీవితాన్ని అరెస్ట్ చెయ్యాలని చూసినప్పుడు భరించక తప్పదు. తప్పే! ఐనా ఆ అవినీతిలో ఒక న్యాయం లేక పోలేదు.

పిల్లిలాగావచ్చి, ప్రక్కనే వున్న సోఫాలో కూర్చున్నాడు చలపతి.

'మళ్ళీ నేను రేపు, తెల్లవారుఝామునే లేచి మనూరు వెళ్ళిపోవాలి. ఈ లోగా నీతో ఒక ముఖ్యమయిన విషయంగురించి మాట్లాడాలన్న నా కోరిక ఇలా నెరవేరుతున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది.' అన్నాడు చలపతి.

భూపతి నిశ్శబ్దంగా వింటున్నాడు.

'ఆ వచ్చిన అమ్మాయిల్లో, చలాకీగా నాట్యం చేస్తూవున్న, పూర్ణిమా జయరాం లాగా వున్న వయ్యారిని, నువ్వు గమనించావా? ఆ అందాన్ని తలదన్నుతుంది మన మాధవి– సౌందర్యం!'

'మాధవి ఎవరు?!'

'చెప్తున్నాను. రామాయణానికి సీత లాగా, భారతానికి ద్రౌపదిలాగా, మన వూళ్ళో అంటుకున్న దావానలానికి ఆ మాధవే అసలుకారణం. ఇంతకిముందే చెప్పానుగదా, మాధవి అసాధారణ సౌందర్యవతి–అని....'

'ఊఁ.'

'కొమ్ములుతిరిగిన ఎంతటి మొగాళ్ళ నయినా దాసోహం అనేట్టుచేసే ఆ మాధవికి, మన శివరావులొంగిపోయాడు. శివరావు అంటే నీ కజిన్. మనవాడు."

'శివరావుకి ఇంకా ఆ బుద్ధులు పోలేదా?! పెళ్ళయి నలుగురు పిల్లల్ని కూడా కన్నాడుగదా!' ఆశ్చర్యంగా అన్నాడుభూపతి.

'ఉహు. ఆ కారణం వలన, మన

శివరావు కొన్ని పిచ్చిచేష్టలు చేసాడు. ఆ అమ్మాయికి రాయబారాలు పంపాడు. అవి ఫలించలేదు! ఒకసారి ఆ పిల్ల ఒంటరిగా వుండగా అదనుచూసి, చెయ్యి పట్టుకున్నాడు. మాధవి అరిచి గోల పెట్టింది. మనవాడుపారిపోయి వచ్చేసాడు.

'నాన్సెన్స్!'

'ఆ సందర్భంగా ఒకసారి లక్ష్మడు–నా దగ్గరికి వచ్చి వివరంగా అన్నీ చెప్పుకుని చాలా బాధపడ్డాడు. లక్ష్మడు అంటే ఆ పిల్ల భర్త, ఆ మధ్యే పెళ్ళిచేసుకుని కాపురానికితెచ్చుకున్నాడు. కాకి ముక్కుకి దొండపండులాగా వుంటుంది ఆ జంట. ఆ లక్ష్మడుగాడికి, పైగా ఒక కాలు అవుడు. వాడితాత ముత్తాతల కాలంనించీ మన భూములమీద పనిచేసి బ్రతుకుతున్నారు. వీడూ అంతే....'

'సరే! అప్పుడు నువ్వు ఏంచేసావు?'

'ఆ లక్ష్మడుగాడ్ని సర్దిచెప్పిపంపించి, ఆ తర్వాత శివరావుని పిలిపించి అటువంటి పన్లు తగవని హెచ్చరించాను.'

'ఆఁ. తర్వాత ... ఏమయింది?'

'శివరావు నా మాటలన్నీ విని తల వూపి వెళ్ళిపోయాడు. కాని అతనిపద్ధతి మారలేదు.'

'రాస్కెల్!'

'ఆ తర్వాత ఒకనాడు ఆ అమ్మాయి, దొడ్లో బట్టలువిప్పుకుని స్నానంచేస్తూ వుంటే, శివరావువెళ్ళి ఎదురుగా నిలబడి, ఆమె నగ్న సౌందర్యాన్ని కళ్ళతో తనివి దీరాతాగటం సాగించాడట! ఆ అమ్మాయి భయపడి, కేకలుపెట్టింది. నలుగురూ పోగయ్యారు. అప్పుడే పొలంనించి ఇల్లు చేరిన లక్ష్మడుగాడు శివరావుని పట్టుకుని ఎడాపెడా వాయించాడు. నిప్పు అంటుకుంది. అగ్రవర్ణానికి చెంది పెత్తనం చేస్తూ వున్న ఒక వర్గానికి చెందిన వ్యక్తిని, అధమ వర్ణుడయిన లక్ష్మడుగాడు బరితెగించి అలా కొట్టి అవమానించటం అన్నది సహించరానిదయింది. మన జనాలు అందరూ వుద్రేకపడి పోయారు.'

'బుద్ధి లేకపోతే సరి!'

'దానిమీద, ఒకసారి మన కుర్రవాళ్ళు నలుగురూచేరి ఆ లక్ష్మడిగాడిని పట్టుకుని చితకబాదారు. దేహశుద్ధి చేసారు.'

'మన వాళ్ళకి నువ్వయినా చెప్పలేదా?'

'చెప్పాను. వాళ్ళు దాన్ని ప్రిస్టేజి ఇస్యూగా తీసుకున్నారు. నా మాటలు వినిపించుకోలేదు. ఏది ఎటువంటిదయినా శివరావు మనవాడు. మన మనిషి. మన శివరావుని మన మోచేతుల క్రింద నీళ్ళు తాగి బ్రతికే ఆ లక్ష్మడుగాడు అలాగ అవమానించటం సహించలేమని మన వాళ్ళు భీష్మించి చెప్పారు.'

'ఓహో!'

'ఆ తర్వాత ఒక దానిమీద ఒకటిగా చాలా సంఘటనలు జరిగాయనుకో. వాళ్ళ గుడిసెలూ, మన గడ్డివాములూ తగలబడ్డాయి. మన వాళ్ళంతా ఒకటి అయినట్టే, వాళ్ళూ ఒకటి అయ్యారు. రెండు వర్గాలూ కోర్టులకి ఎక్కాయి. గత ఏడాదిగా ఇది రావణ కాష్ఠంలాగా మండుతూ వుంది.'

'హూఁ.'

'పోతే ఈ మధ్యన మరొక సంఘటన జరిగింది. చీకట్లో ఆ లక్ష్మడిగాడి ఇంటి దగ్గర తచ్చాడుతూ వున్న మన శివరావుని వాళ్ళ కుర్రవాళ్ళు కొందరు పట్టుకున్నారు.'

'అప్పుడు ఏం జరిగింది? శివరావుకి అసలు బుద్ధిలేదు. పశువునయం.'

'వాళ్ళు శివరావుని చితకబాది, సీల మండ దగ్గర మెలిదిప్పి, మనవాడ్ని కాలు విరిచేసి అవిటివాడ్ని చేసారు. శివరావుకి ఆ గతిపట్టింది చివరికి. ఇప్పుడు మన కుర్రవాళ్ళు మంతనాలు చేస్తున్నారు. చివరికి వాళ్ళు ఒక నిర్ణయానికి వచ్చి ఆ సంగతి నాకు చెప్పారు. నువ్వు అప్రూవ్ చెయ్యాలి.'

'ఏమిటా నిర్ణయం?'

'అదును చూసి ఆ లక్ష్మడుగాడ్ని సఫాచేసి, ఈ గొడవ కంతటికీ కారణమయిన ఆ మాధవికి బొట్టు చెరిపేయటం, పగ తీర్చుకోవటం.'

'దారుణం! నువ్వేమన్నావ్?'

'సరే. అలాగే చేద్దాం. మన భూపతికి కూడా చెప్పిచేద్దాం. అందాకా ఆగండి' అని, నీ దగ్గరకి వచ్చాను– ఇదీ సంగతి.'

'ఇప్పుడు నేనేం చెయ్యాలి?'

'యన్సనాలి! రేపు ఆ హత్య జరిగితే కేసు కోర్టుకి ఎక్కుతుంది గదా! అప్పుడు నువ్వు ఇక్కడ నీ ఇన్ఫ్లుయన్స్‌ని వుపయోగించి ఆ కేసు కొట్టివేయించాలి. అంతే!'

'నాన్సెన్స్. అటువంటి పన్లు నేను చెయ్యను.' నిర్ద్వంద్వంగా చెప్పాడు భూపతి. చలపతి ఆశ్చర్యంగా చూసాడు.

'మా అందరికీ నువ్వు పెద్దదిక్కువి. భూపతి! నువ్వే కాదు అని అంటే మన వాళ్ళు ఏమయిపోవాలి?' అని సూటిగా అడిగాడు. భూపతి చాలాసేపు ఆలోచించాడు.

'చలపతి! ఒక ప్రశ్న అడుగుతాను. సమాధానం చెప్పు. ఆ లక్ష్మడుగానీ, అతనికి సంబంధించిన మరొకడుగానీ, మన భార్యలు లేక కూతుళ్ళనికామించి, మోహించి, వెనకాలపడి అల్లరి చేస్తారనుకో. అప్పుడు మనకి ఎలా వుంటుంది? మనం ఏం చేస్తాం? చెప్పు.'

'గాడ్డి కొడుకుల్ని నిలువునా ఖూనీ చేసి భూమిలో పాతేస్తాం' ఎర్రనయిన కళ్ళతో గర్జించాడు చలపతి. అతని నరాలు పొంగాయ్. భూపతి నవ్వాడు.

'చలపతీ! అది పొరపాటు పని. అందుకే నీకు అంతకోపం వచ్చింది. సభ్యసమాజం హర్షించని అటువంటి తప్పుడుపనినే శివారావూ చేశాడు. వాళ్ళకి కోపంవచ్చి తగిన శాస్తి చేసారు. తప్పు ఎటునుంచి జరిగినా తప్పే గదా! దోషి

శిక్షింపబడక తప్పదు గదా! అటువంటప్పుడు మనవాళ్ళు అలాగ చెలరేగటంలో న్యాయం వుందంటావా?' అన్నాడు, భూపతి సాలోచనగా. 'ఐనా నావాళ్ళూ అవతలి వాళ్ళూ అన్న తేడావుంటుంది గదా! పైగా ఇది మన ప్రిస్టేజీకి సంబంధించిన విషయం.'— చలపతి అన్నాడు.

'తప్పుడు పన్లుచేసి, ప్రిస్టేజీ అంటూ తొడగొట్టటం ఉచితంగాదు, చలపతీ!' తీవ్రంగా అన్నాడు భూపతి.


చలపతి విచారంగా తలదించుకున్నాడు. చాలాసేపు భారంగా నిట్టూర్పులు వదిలాడు.

'పార్టీలో స్నేహితులు కోరగానే, కాల్ గరల్స్‌ని తెప్పించి వాళ్ళని సంతృప్తిపరచిన నువ్వు, ఇలాగ తప్పొప్పుల్ని గురించి మాట్లాడటమే నాకు చిత్రంగా వుంది.' అని ఎత్తిపొడిచాడు చలపతి.

భూపతి నవ్వాడు. 'నాకు తెలుసు చలపతీ, ఈ ప్రశ్న వస్తుందని. అడిగావు గనుక చెప్తున్నాను. విను ఇక్కడ నా ఫ్రెండ్సూ, కాల్ గరల్సూ అని రెండు వర్గాలున్నాయి. ఈ పని తప్పుడుపనే అయినా ఇరువయిపుల వారికీ ఇష్టమయిందవటం వలన ఇందులో నీతి భాధ్యత అన్నది అంతగాలేదు. కానీ మన శివరావు కామాంధుడయి, వివాహిత అయిన ఆ మాధవి వెనకాల పడటంలో ఏరకమయిన నీతీ లేదు సరిగదా, అది రాక్షసమయిన పనే అనిపించుకుంటుంది....' అన్నాడు.

చలపతికి కోపం వచ్చింది.

'భూపతీ! నువ్వు అవునన్నా కాదన్నా మనవాళ్ళు ఆగరు. ఆలక్ష్మడు ఇక ఈ భూమిమీద అసలు బ్రతికి బట్టగట్టటాన్ని వీలులేదు, మనవాళ్ళూ అన్న అభిమానం కాస్త వుంచి, నువ్వు మన కొమ్ముకాయక తప్పదు.' ఆవేశంగా అన్నాడు. భూపతి మౌనంగా వుండిపోయాడు.




'ఇదే మీనాన్న కాలంలో అయితే అసలు ఇంతడిస్కషన్ అవసరమయ్యేదే కాదు. ఇంత కంటే చాలా పెద్దవయిన ఎన్నో కేసుల్లో ఆయన మన వయిపున గట్టిగా నిలబడి మన పరువు ప్రతిష్ఠలని కాపాడారు. ఇప్పుడు ఆయన మూలను పడటం వలన, ఈ బాధ్యత నీకు తప్పదు. ప్లీజ్! ఇంతగా నేను ఎందుకు చెపుతున్నానో కాస్త అర్థంచేసుకో.' నిశ్చింతగా అన్నాడు చలపతి, ఎర్రగా అయిన కళ్ళతో.

భూపతి చటుక్కున లేచాడు.

'చలపతీ నాతోరా' అని బంగాళాకి దూరంగావున్న అవుట్‌హవుస్ వయిపుగా నడిచాడు. చలపతి అతన్ని అనుసరించాడు.

ఇంకా బంగళాలో పార్టీ జోరుగా నడుస్తూవుంది. అప్పుడే హైపిచ్‌కి చేరుకుంటూ వుంది.

అవుట్‌హవుస్‌లో దీపం వెలుగుతూ వుంది. తలుపు చప్పుడు లేకుండా తోసి, భూపతి లోపలకి అడుగు పెట్టాడు. చలపతి అతన్ని అనుసరించాడు.

'అటుచూడు, చలపతీ! ఆ మంచం మీద పక్షపాతం వాతబడి, కాలూ చెయ్యీ పడిపోయి, దీనంగా కాలం గడుపుతూ వున్న వ్యక్తి మానాన్న రఘుపతిగారు. కేవలం తనవాళ్ళూ, పరాయివాళ్ళూ అన్న భావన తెచ్చిన, అహంకారంతో, ఆకాలంలో, ఈయన, న్యాయం, అన్యాయం, పాపం, పుణ్యం అన్నవాటిని విస్మరించి, కేవలం ప్రిస్టేజీనీ, పలుకుబడినీ నమ్ముకుని, ఎన్నోదారుణమయిన పనులు జరగటానికి కారకుడయ్యాడు. ఆపాపమే పెరిగి, పండి, ఈనాడు ఈ రకంగా ప్రాయశ్చిత్తం అనుభవిస్తున్నాడు. నాకూ, మనవాళ్ళంటే ఎంతో అభిమానం వుంది—కాని పాప భీతి ఎంతో వున్నవాడ్ని. చదువు,సంస్కారం, మారుతున్న కాలాన్ని గురించి అవగాహనా వున్న వాణ్ణి. పైగా పిల్లలూ సంసారం వున్న వాణ్ణి! కనుక నన్ను క్షమించు చలపతీ! నీ కోరికని తీర్చటం నావల్లకాదు, ఆ బరువు నేనెత్తలేను' అన్నాడు భూపతి.

అవుట్‌హవుస్ బయిటకివచ్చి, కోపంగా, తన కారువయిపు అడుగులు వేసాడు, చలపతి. భూపతి బంగళా వయిపు సాగాడు.

———